


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

## లివర్ సక్రమంగా పనిచేయట్లేదా..

పచ్చి క్యారెట్‌లను తింటే ఆరోగ్యానికి అనేక లాభాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. క్యారెట్‌లో ప్రత్యేకమైన ఫైబర్స్ ఉంటాయి. ఇవి జీర్ణక్రియకు తోడ్పడతాయి. లివర్ సక్రమంగా పనిచేసేందుకు తోడ్పడుతాయి. అలాగే శరీరంలోని చెడు బ్యాక్టీరియా, ఎండోటాక్సిన్, ఈస్ట్రోజెన్‌లను నియంత్రిస్తాయి. ఇంకా విటమిన్ ఎ, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. రక్త పోటును తగ్గిస్తుంది. కంటి చూపును పెంచుతుంది. పేరుకు పోయిన కొవ్వును తగ్గిస్తుంది.



# తెలంగాణ గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా

## తమిళనాడు నుంచి బీజేపీ తరుపున పోటీ చేసే అవకాశం




తెలంగాణ గవర్నర్ పదవి, పుదుచ్చేరి ఎల్జీ పదవికి తమిళిసై సౌందరరాజన్ రాజీనామా చేశారు. తమిళనాడు నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయనున్నట్లు తెలుస్తోంది. కాగా.. గవర్నర్ రాజీనామా విషయాన్ని సోమవారం రాజ్ భవన్ అధికారికంగా ధృవీకరించలేదు.. అయితే, తమిళిసై లోక్ సభ ఎన్నికల్లో కన్యాకుమారి, చెన్నై సౌత్, తిరునల్వేలి నుంచి బరిలోకి దిగే అవకాశం ఉందని మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. కన్యాకుమారి.. తమిళిసై సొంత జిల్లా.. అంతేకాకుండా కన్యాకుమారి, తిరునల్వేలిలో అధికంగా నాడార్ ఓటు బ్యాంక్ ఉండటంతో.. వీటిలోని ఏదో ఒక స్థానంలో తమిళిసై పోటీచేయనున్నట్లు చెబుతున్నారు.గవర్నర్ పదవికి రాజీనామా నేపథ్యంలో తమిళిసై సౌందరరాజన్ ఎన్నికల రణక్షేత్రంలోకి దిగబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్త కథనాలు వెలువడుతున్నాయి. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తమిళిసై తమిళనాడులోని తూత్తుకుడి లేదంటే విరుదునగర్ నుంచి కూడా పోటీ చేసే అవకాశం ఉందని ప్రచారం సాగింది. ఈ క్రమంలోనే గవర్నర్ తమిళిసై తన రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపినట్లు సమాచారం. తెలంగాణ గవర్నర్ పదవితోపాటు పుదుచ్చేరి ఎల్జీ పదవికి రాజీనామా చేస్తూ లేఖను పంపినట్లు తెలుస్తోంది.

**తమిళిసై రాజకీయ జీవితం..**


1999లో బీజేపీలో చేరిన తమిళిసై.. 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర చెన్నై నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2011 ఎన్నికల్లో వేళచ్చేరి నియోజకవర్గం నుంచి పోటీచేసి నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అన్నా డీఎంకే కూటమి నేతృత్వంలో తూత్తుకుడి నుంచి పోటీ చేసి డీఎంకే అభ్యర్థి కనిమొళి చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత తమిళిసైను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు గవర్నర్‌గా పంపింది. ప్రస్తుతం ఆమె పుదుచ్చేరి ఇన్‌చార్జి ఎల్జీగా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. కాగా, తమిళిసై తండ్రి కమరి ఆనంద్ తమిళనాడు కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా పనిచేశారు.

## అధికారంలోకి రాగానే అమరావతి నిర్మాణ పనులు

**టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్**



వైసీపీ హయాంలో ఆగిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరి ఎల్ఈపీఎల్ అపార్టుమెంట్ వాసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే అమరావతి నిర్మాణ పనులు చేపడతామన్నారు. మంగళగిరిలోని స్వర్ణకారుల కోసం ప్రత్యేక సెజ్ తీసుకొస్తామని తెలిపారు. స్థానికులకే ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభకు తరలివచ్చిన ప్రతిఒక్కరికీ టీడీపీ అధినేత చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సమష్టిగా ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలనే సంకల్పం మరింత బలపడిందని చెప్పారు. కలిసికట్టుగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నేడు పదో తరగతి పరీక్షల ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు చంద్రబాబు, లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.



## సర్ఫరాజ్‌కు లక్కీ ఛాన్స్!

ఐపీఎల్ 17వ ఎడిషన్ ప్రారంభానికి ముందే ఫ్రాంచైజీలకు షాకుల మీద షాకులు ఇస్తున్నాయి గాయాలు. ఇప్పటికే గాయాల కారణంగా కీలక ఆటగాళ్లు టోర్నీకి దూరం అయ్యారు. తాజాగా గత సీజన్ రన్నరప్ టీమ్ గుజరాత్ టైటాన్స్‌కు భారీ షాక్ తగిలింది. రూ. 3.60 కోట్లకు కొనుగోలు చేసిన రాబిన్ మింజ్‌కు ఇటీవల యాక్సిడెంట్ అయిన సంగతి తెలిసిందే. అయితే ప్రమాదం నుంచి కోలుకుని ఐపీఎల్ ఆడతాడని అందరూ భావించారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని తెలుస్తోంది. రాబిన్ మింజ్ ఈ సీజన్‌కు దూరమైయ్యే అవకాశాలు ఉన్నాయని గుజరాత్ కోచ్ ఆశిష్ నెహ్రా పీటీఐకి తెలిపినట్లు సమాచారం.అయితే రాబిన్ ప్లేస్ లో టీమిండియా చిచ్చరపిడుగు సర్ఫరాజ్ ఖాన్‌ను తీసుకునే ఆలోచనలో గుజరాత్ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ న్యూస్ వైరల్ గా మారింది. ఇదే నిజమైతే.. ఇంగ్లండ్ తో జరిగిన టెస్ట్ సిరీస్ లో దుమ్మురేపిన సర్ఫరాజ్ ఐపీఎల్ లో మెరుపులు మెరిపించడం ఖాయం. కాగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## అందాల డోస్ పెంచుతోన్న అనుపమ

అనుపమ పరమేశ్వరన్ మలయాళ 'ప్రేమమ్' సినిమాతో ఎంత పాపులర్ అయ్యిందో తెలిసిందే. ఆ సినిమాతో అనుపమకు తెలుగులో కూడా చాలా సినిమా అవకాశాలొచ్చాయి. అనుపమ లేటెస్ట్‌గా తెలుగులో కార్తికేయ 2లో నటించారు. ఈ సినిమా 2022 ఆగస్టు 13న విడుదలై మంచి ఆదరణ పొందింది. ఇక ఆ సినిమా తర్వాత ఇదే జంట 18 పేజేస్‌తో మరోసారి అలరించింది. ఇక అనుపమ డీజే టిల్లు 2లో నటిస్తున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అంతేకాదు ఆమె కొన్ని రోజుల పాటు షూట్‌లో కూడా పాల్గొందని టాక్ నడిచింది. కొన్ని భేదాభిప్రాయాల వల్ల అనుపమ ఆ సినిమా నుంచి తప్పుకుందని మరో వార్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆమె స్థానంలో చాలా మందిని పరిశీలించి మరోసారి ఆమె దగ్గరకే డీజే టిల్లు టీమ్ వచ్చింది.




## ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు మృతి

బీహార్‌లోని ఖగారియా ప్రాంతంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లికి వెళ్లి ట్రాక్టర్‌పై తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన సంభవించింది. పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యారత్ పెట్రోల్ పంపు సమీపంలో NH-31పై ట్రాక్టర్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు చనిపోయారు. వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.





## హిమాచల్‌ప్రదేశ్‌లో పీచు మిఠాయి నిషేధం

హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రంలో పీచు మిఠాయి తయారీ, నిల్వ, విక్రయాలను ఏడాది పాటు నిషేధిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 మే 15 వరకు ఈ నిబంధన అమల్లో ఉంటుందని తెలిపింది. వీటిలో ప్రమాదకరమైన రంగులు కలుపుతున్నట్టు గుర్తించిన ఆహార భద్రత అధికారులు, ఇవి ఆహార భద్రత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. పెద్దలు, చిన్నపిల్లల ఆరోగ్యంపై ఇవి దుష్ప్రభావం చూపుతాయని నిర్ధారించారు.



## నన్ను అక్రమంగా అరెస్టు చేశారు.. సుప్రీంకోర్టులో కవిత పిటిషన్

ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే తనను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో విచారణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు చెప్పి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా భావించి దర్యాప్తు సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కవిత తరఫు న్యాయవాది నేడు ఆన్‌లైన్‌లో పిటిషన్ దాఖలు చేశారు.



## సింగర్ మంగ్లీకి తృటిలో తప్పిన ప్రమాదం..

ప్రముఖ సింగర్ మంగ్లీకి ప్రమాదం తృటిలో తప్పింది. కారులో ప్రయాణిస్తున్న మంగ్లీ కారును డీసీఎం వాహనం ఢీ కొట్టింది. శంషాబాద్ తొండుపల్లి సమీపంలో ఈ ఘటన జరిగింది. నందిగామ కన్హ శాంతివనంలో ఆధ్యాత్మిక మహోత్సవానికి మంగ్లీ హాజరైంది. తిరిగి అర్ధరాత్రి ఇంటికి వెళుతున్న సమయంలో హైదరాబాద్ - బెంగళూరు రహదారిపై తొండుపల్లి వంతెన వద్ద మంగ్లీ కారును డీసీఎం వాహనం వెనక నుంచి ఢీ కొట్టింది. కారులో మంగ్లీతో పాటు మేఘరాజ్, మనోహర్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ఈ ముగ్గురికీ స్వల్ప గాయాలైనట్టు తెలుస్తోంది. డీసీఎం డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.



## ఈ నెల 20న వైసీపీ మేనిఫెస్టో విడుదల

ఏపీ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. సార్వత్రిక ఎన్నికలతో పాటుగా ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు వెల్లడించింది. నాలుగో దశలో ఏపీలో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు ఏప్రిల్ 25 వరకూ అవకాశం కల్పించారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29వ తేదీ వరకూ గడువు ఇచ్చారు. ఏపీలోని 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలకు మే 13న ఎన్నికలు జరగనుండగా.. జూన్ 4న ఫలితాలు విడుదల కానున్నాయి. అయితే...నిన్న వైసీపీ పార్టీ 175 ఎమ్మెల్యే అభ్యర్థులు, 25 ఎంపీ అభ్యర్థులను రిలీజ్ చేసింది. ఈ నెల 20న వైసీపీ మేనిఫెస్టో విడుదల చేయనున్నారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో హానికర కంటెంట్!

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లను నిర్వహిస్తున్న మెటా సంస్థపై లొట్టె రుబీక్ అనే సైకాలజిస్ట్ సంచలన ఆరోపణలు చేశారు. మెటా సంస్థ యూజర్ల శ్రేయస్సు కంటే ఆదాయానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నదని ఆమె ఆరోపించారు. గత మూడేండ్లుగా మెటా సంస్థ నిపుణుల బృందంలో పని చేసిన లొట్టె రుబీక్.. ఆత్మహత్యల నివారణ, హానికర కంటెంట్‌పై సలహాదారుగా వ్యవహరించారు.అయితే, ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న హానికర కంటెంట్‌ను తొలగించాలని తాను చేసిన సూచనను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఆమె తన పదవికి రాజీనామా చేశారు. యువతులు, ఆడపిల్లలపై ప్రభావం చూపుతున్న, ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్న కంటెంట్‌పై మెటా సంస్థ ఉదాసీనతతో వ్యవహరిస్తున్నదని ఆమె ఆరోపించారు. మరోవైపు మెటా ప్లాట్‌ఫార్మ్‌లలో అక్రమంగా మాదకద్రవ్యాల అమ్మకాలు జరుగుతున్నాయని అమెరికా దర్యాప్తు సంస్థలు మెటాపై విచారణ ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో ఒక కథనం ప్రచురితమైంది.



## ఏకపక్ష విజయం.. మరోసారి రష్యా అధ్యక్షుడిగా పుతిన్

రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ మరోసారి ఘన విజయం సాధించారు. మూడు రోజులుగా జరుగుతున్న రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఆదివారం ముగిసింది. ప్రాథమిక ఫలితాల ప్రకారం పుతిన్‌కు రికార్డు స్థాయిలో 87.8 శాతం ఓట్లు లభించినట్లు తెలుస్తున్నది. 24 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపును చేపట్టిన మీదట ఈ విషయం తేలింది. దీంతో ఆయన ఐదోసారి దేశాధ్యక్ష పదవిని చేపట్టనున్నారు.మార్చి 15న ప్రారంభమైన ఎన్నికల పోలింగ్ మూడు రోజుల పాటు జరిగి 17న ముగిశాయి. 1999 నుంచి దేశ అధ్యక్షుడిగా కొనసాగుతున్న పుతిన్.. తాజా విజయంతో మరో ఆరేండ్లపాటు అదే పదవిలో ఉండనున్నారు. దీంతో రష్యాలో ఎక్కువ కాలం అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తిగా జోసెఫ్ స్టాలిన్‌ను అధిగమించనున్నారు. కాగా, ఈ ఎన్నికల్లో పుతిన్‌తో కలిపి నలుగురు అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. అయితే ప్రధాన ప్రత్యర్థి అయిన నావల్నీ ఎన్నికలకు ముందే చనిపోవడంతో ఆయనకు అసలు పోటీయే లేకుండా పోయింది. కాగా, చివరిరోజు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని, పుతిన్ విధానాలను వ్యతిరేకిస్తున్నవారు పోలింగ్ కేంద్రాలకు రావాలని దివంగత విపక్ష నేత నావల్నీ మద్దతుదారులు పిలుపునివ్వడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## చికెన్, మటన్ తినే వారికి అలర్ట్

ఇండియన్ కౌన్సిల్‌ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, ఐక్యరాజ్య సమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ ఇటీవల చేసిన సంయుక్త అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. కోళ్లు, మేకలు, రొయ్యలు, చేపల పెంపకంలో యాంటీ బయాటిక్స్ వాడకం పెరిగినట్లు గుర్తించారు. దేశంలో 10 రాష్ట్రాల నుంచి శాంపిళ్లను వారు సేకరించారు. కోళ్లలోనే ఎక్కువ శాతం యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది.




## ఉబర్‌కు షాకిచ్చిన కోర్టు

ఉబర్‌కు వినియోగదారుల కోర్టు షాకిచ్చింది. ప్రయాణికుడి నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయడంపై రూ.20 వేల జరిమానా విధించింది. చండీగఢ్‌కు చెందిన అశ్వనీ ప్రశార్ ఉబర్ యాప్‌లో క్యాబ్ బుక్ చేసుకునే సమయంలో ఛార్జీ రూ.359 అని చూపించింది. గమ్యాన్ని చేరుకున్నాక రూట్ డీవియేషన్‌ల కారణంతో ట్రిప్ ఛార్జీ 8.83 కి.మీ దూరానికి రూ.1,334 అని రావడంతో అతడు కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం కోర్టు ఉబర్ సంస్థకు జరిమానా విధించింది.




## పాకిస్థాన్ చేతికి చైనా నిఘా నౌక

పాకిస్థాన్ నేవీలో మొట్టమొదటిసారిగా ఒక నిఘా నౌక చేరింది. అణు వార్ హెడ్లు ఉన్న బాలిస్టిక్ క్షిపణులను కూడా పసిగట్టే సామర్థ్యం ఉన్న ఈ నౌకను చైనా నుంచి సమకూర్చుకుంది. అలాగే ఈ నౌక ఇతర కీలక సమాచారాన్ని సేకరించగలదు. 87 మీటర్ల పొడవున్న ఈ నౌకకు పీఎన్ఎస్ రిజ్వాన్ అని పేరు పెట్టారు. ఈ షిప్‌లో రాడార్లు ఇతర ట్రాకింగ్ వ్యవస్థలు కలిగిన మూడు డోములున్నాయి. కాగా ఇప్పటికే భారత్ వినియోగిస్తున్న ఐఎన్ఎస్ ధ్రువ్ కంటే చిన్నది.



## కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఇద్దరు దుర్మరణం

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో నిర్మాణంలో ఉన్న ఓ ఐదంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. ఇప్పటివరకు 13 మందిని రక్షించారు. శిథిలాల కింద మరింత మంది చిక్కుకుని ఉంటారని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాకా గార్డెన్ రీచ్ ప్రాంతంలోని ఓ కాలనీలో ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వాళ్లను హుటాహుటిన దవాఖానకు తరలించారు. సోమవారం ఉదయం రంగంలోకి దిగిన 50 మంది సభ్యులతో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రస్తుతం అక్కడ సహాయక చర్యల్లో పాల్గొంటున్నది. కాగా, భవనంలో ఎవరూ లేరని స్థానికులు తెలిపారు. కానీ దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న గుడిసెలపై శిథిలాలు పడ్డాయని చెప్పారు. ఇంకా పదుల సంఖ్యలో శిథిలాల్లో చిక్కుకుని ఉంటారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు.




## ఒకే కేవైసీ విధానంపై కేంద్రం కసరత్తు

ఫైనాన్షియల్ సర్వీస్ సెక్టార్‌లో ఒకే కేవైసీ విధానాన్ని తీసుకొచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం బ్యాంకు ఖాతాల నుంచి ఇన్సూరెన్స్ పాలసీల కొనుగోలు వరకు ఆయా సంస్థలకు కేవైసీ సమర్పించాల్సి వస్తోంది. అడ్రస్, ఫోన్ నంబర్ మారినా మళ్లీ మార్పులు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వినియోగదారుల వివరాలన్నీ లభ్యమయ్యే ఒకే కేవైసీ విధానాన్ని తేవాలని ఫైనాన్షియల్ స్టెబిలిటీ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రతిపాదించింది.



## మాల్దీవుల్లో ఎన్నికలు.. భారత్‌కు బ్యాలెట్ బాక్సులు

మాల్దీవుల్లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులను భారత్ సహా శ్రీలంక, మలేషియాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆ దేశ ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఏప్రిల్ 21న జరిగే ఈ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం అభ్యర్థనలు చేసుకునేందుకు విధించిన గడువు శనివారంతో ముగిసింది. సుమారు 11 వేల మంది ఓటర్లు తమ కోసం పోలింగ్ స్టేషన్లు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. తిరువనంతపురం(భారత్),కొలంబో(శ్రీలంక), కౌలాలంపూర్(మలేషియా)లో బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేయనున్నట్లు అక్కడి ఈసీ తెలిపింది. "గతంలో మాల్దీవుల పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు శ్రీలంక, మలేషియా నుంచి మాత్రమే రిజిస్టర్ చేసుకునేవారు. ఈ సారి కేరళలోని తిరువనంతపురం నుంచి 150 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఇక్కడ కూడా బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం" అని మాల్దీవుల సెక్రటరీ జనరల్ హసన్ జకారియా తెలిపారు. మొత్తం 93 పార్లమెంట్ స్థానాలకు 389 మంది పోటీ చేస్తున్నారు. భారత అనుకూల మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ (MDP) 90 స్థానాల్లో పోటీ చేస్తుండగా, అధ్యక్షుడు ముయిజ్జు నేతృత్వంలోని ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ మాల్దీవ్స్ (PPM), పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (PNC) కూటమి 89 స్థానాల్లో బరిలో ఉంది. కొద్దిరోజుల క్రితం రష్యా అధ్యక్ష ఎన్నికల ఓటింగ్ తిరువనంతపురంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ దేశ దౌత్య సిబ్బంది, శాస్త్రవేత్తల కోసం బ్యాలెట్ బాక్సులను భారత్‌కు తరలించారు. ఇదే తరహాలో మాల్దీవుల పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ ఇక్కడ జరగనుంది.

ఇతరుల జోక్యం అనవసరం: ముయిజ్జు
మాల్దీవులు చిన్న దేశం కాదని, దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల గురించి ఇతరులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధ్యక్షుడు ముయిజ్జు వ్యాఖ్యానించారు. మాల్దీవుల జాతీయ రక్షణ దళం (MNDF) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'

## నేను గెలవకపోతే రక్తపాతమే



అమెరికా ప్రెసిడెంట్ గా తాను మళ్లీ గెలవకపోతే దేశంలో రక్తపాతం జరుగుతుందని ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అధ్యక్ష ఎన్నిక అమెరికా చరిత్రలో అతి ముఖ్యమైన రోజని ఆయన పేర్కొన్నారు. తాను మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికవడం అత్యంత అవసరమని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు జో బైడెన్ విధానాలకు వ్యతిరేకంగా ఒహియోలో నిర్వహించిన ర్యాలీలో ట్రంప్ మాట్లాడారు. తమ దేశ చరిత్రలో నవంబర్ 5వ తారీఖు అతి ముఖ్యమైన రోజుగా నిలిచిపోతుందని భావిస్తున్నానని చెప్పారు. అధ్యక్షుడు బైడెన్ వరస్ట్ ప్రెసిడెంట్ అని వ్యాఖ్యానించారు. బైడెన్ వాహన పరిశ్రమ విధానాలపై తీవ్రంగా విమర్శలు చేశారు. మెక్సికోలో కార్లు తయారుచేసి అమెరికన్లకు అమ్మాలన్న చైనా ప్లాన్లకు బైడెన్ మద్దతు తెలుపుతున్నారని మండిపడ్డారు. తాను మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికైతే చైనా పప్పులు ఉడకవని, అమెరికాలో తమ కార్లు విక్రయించాలన్న ప్రయత్నం సఫలం కాదన్నారు. అమెరికాలో కార్లను చైనా విక్రయించాలనుకుంటే 100% దిగుమతి సుంకం విధిస్తానని చెప్పారు. లక్షలాది మంది ఇమ్మిగ్రెంట్లకు బైడెన్ ప్రభుత్వం వర్క్ పర్మిట్లు జారీచేసి అమెరికన్లను బైడెన్ వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ట్రంప్ ఓ లూసర్డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బైడెన్ ప్రచారవర్గం స్పందించింది. ట్రంప్ ఓ లూసర్ అని విమర్శించింది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఓడిపోయారని గుర్తుచేసింది.

## సమ్మర్‌ని కూల్‌గా మార్చేందుకు మార్కెట్ లోకి ఫ్యాన్ క్యాప్స్



సమ్మర్ లో బయటకు రావాలంటే చాలామంది క్యాప్‌లను ధరిస్తుంటారు. అలాంటి వారి కోసం ఈ హాట్ సమ్మర్‌ని కూల్‌గా మార్చేందుకు ఫ్యాన్ క్యాప్స్ అందుబాటులో వచ్చాయి. వాటిలో Lukzer 1PC Outdoor Electric Fan Cap. ఈ క్యాప్ రూ. 599కే అమెజాన్‌లో అందుబాటులో ఉంది. PELO Sun Fan Hat/Face Cooling Cap. దీనిని రూ. 692కి అమెజాన్‌లో అందుబాటులో పొందవచ్చు. వీటికి యూఎస్‌బీ కేబుల్‌తో ఛార్జింగ్ చేసుకోవచ్చు.

## ఆ విషయం నాకు చిన్నప్పుడే అర్థమైంది

### సారా అలీఖాన్

బాలీవుడ్ నటి సారా అలీఖాన్ కెరీర్‌లో ఒక్కో అడుగూ జాగ్రత్తగా వేస్తూ ముందుకు వెళ్తున్నది. ఆమె నటించిన 'మర్డర్ ముబారక్' సినిమా ఓటీటీలో మంచి హిట్ సాధించింది. తాజాగా ఆమె 'యే వతన్ మేరే వతన్' చిత్రంలో నటిస్తున్నది. నటుడు సైఫ్ అలీఖాన్, అమృతా సింగ్ ముద్దుల కూతురు సారా బాల్యం ఆడిందే ఆటగా ఏం సాగలేదు. సైఫ్, అమృత విడిపోవడంతో ఆమె తల్లి దగ్గరే ఎక్కువగా పెరిగింది. 'నా ధైర్యం మా అమ్మే! సింగిల్ మదర్‌కు ఎన్నో సవాళ్లు ఉంటాయి. వాటిని అమ్మ అధిగమించి, నన్ను పెంచిన తీరు అబ్బురమనిపిస్తుంటుంది. అమ్మ పెంపకంలో నేను ఇండిపెండెంట్‌గా పెరిగాను. మన కోసం ఎవరో వచ్చి, ఏదో చేస్తారని అనుకోవద్దని చిన్నప్పుడే అర్థమైంది. నా ధైర్యానికి కారణం అమ్మే!' అని చెప్పుకొచ్చింది సారా. పరిస్థితులకు తగ్గట్టుగా ఉండగలగడం చెప్పినంత తేలిక కాదంటుందామె. 'చాలాసార్లు మనం అనుకున్నట్టుగా ఏదీ జరగకపోవచ్చు. అలాంటప్పుడు చాలా కోపం, చిరాకు కలుగుతాయి. కానీ, ఒక సమస్యను మనం చూసే కోణాన్ని బట్టి దాని పరిష్కారం ఉంటుంది. ఆ పరిస్థితులను అర్థం చేసుకునే శక్తియుక్తులు అమ్మ దగ్గరే నేర్చుకున్నాను' అంటుంది సారా అలీఖాన్.



## పట్టాలు తప్పిన సబర్మతి-ఆగ్రా సూపర్ ఫాస్ట్

రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో రైలు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. సబర్మతి-ఆగ్రా సూపర్ ఫాస్ట్ రైలు ఇంజిన్‌తో సహా నాలుగు కోచ్‌లు పట్టాలు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రయాణీకులు ఎవరూ చనిపోలేదు. కానీ, కొంతమందికి స్వల్ప గాయాలు కావడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. వివరాల ప్రకారం.. అజ్మీర్‌లోని మదార్ రైల్వేస్టేషన్ సమీపంలో సబర్మతి-ఆగ్రా సూపర్ ఫాస్ట్ రైలు ఇంజిన్‌తో సహా నాలుగు కోచ్‌లు పట్టాయి తప్పాయి. ఈ ఘటన అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జరిగినట్టు రైలు ప్రయాణికులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి సమాచారం అందిన వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. కాగా, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అజ్మీర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ , గవర్నమెంట్ రైల్వే పోలీసులతో పాటు అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్, సీనియర్ అధికారులు సహా రెస్క్యూ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. పట్టాలు తప్పిన కోచ్‌లను, ఇంజిన్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

## చెవి దుద్దులు కొనివ్వలేదని.. భర్తకు నిప్పంటించిన భార్య!

చెవి దుద్దులు కొనివ్వడం లేదని భర్తకు భార్య నిప్పంటించిన ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. గాయపడిన అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆమెపై ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. తనకు చెవి దుద్దులు కొనివ్వాలని సమీనా భర్తతో తరచూ గొడవ పడుతోంది. ఈ విషయంపై శనివారం సాయంత్రం ఇద్దరి మధ్య మరోమారు గొడవ జరిగింది. తన వద్ద అంత డబ్బు లేదని.. కొనివ్వలేనని పాషా తేల్చిచెప్పారు. దీంతో క్షణికావేశానికి లోనైన సమీనా.. తన భర్తపై పెయింట్లకు సంబంధించిన రసాయనాన్ని పోసి నిప్పంటించింది. ఈ ఘటనలో అతను గాయపడ్డారు.

